# వల

"ఏమేవ్! ఎక్కడ తగలబడ్డావు? లోపలికివస్తూనే కేకపెట్టారు రావుగారు. "ఏమేవ్!"

"ఎందుకండీ, ఆ కేకలు....అలా ఇల్లెగరగొడ్తున్నారు. అవతల పొయ్యి మండిపోతూంది."

"నీ పొయ్యి తగలడ! పొయ్యేమిటే, నీకు కొంప తగలబడినా లెక్కలేదుగాని. పొయ్యిమాత్రం తగలబడకూడదు" చిటపటలాడిపోయే భర్తవంక కాస్త వింతగా చూసింది జానకమ్మ.

"ఏమయిందండీ! ఏమిటయిందని ఈ రాద్ధాంతం? బాగానేవుంది మీ వరస!"

"ఎందుకు బాగుండదు నా వరస. నీ వరస బాగుంది కనకా, నా వరస బాగులేకపోవడానికి...."

"మీరు ఏమయినా చెపుతారా? నన్ను పొమ్మన్నారా? అవతల బోలెడు పనుంది నాకు."

"ఏది, నిర్మల ఏది?"

"ఇందుకోసమేనా యీ గొడవంతా. ఎక్కడికో షికారుకో, సినిమాకో వెళ్ళి వుంటుంది."

"ఎవడితో వెళ్ళింది? ఎవడితో వెళ్ళిందే?" కోపంగా అడిగారు రావుగారు. తెల్లబోయి చూసింది జానకమ్మ.

"ఏమిటండీ!"

"నీ కసలు పిల్లలసంగతి ఏమయినా తెలుస్తూందా? ఎంతసేపూ వంటింట్లోపడి చావడమేగాని. పిల్లల సంగతి ఏమయినా తెలుస్తూందే నీ కసలు? మంచి చెడ్డా ఏమయినా చూస్తున్నావా?"

"ఏమిటయిందో చెప్పకుండా యేమిటీ గొడవా మీరూనూ!" చిరాకు పడింది జానకమ్మ.

"ఏమిటింకా చెప్పడం: అది నీ కూతురు అడ్డమయినవాడితో ఏ రోడ్డుమీద చూసినా, ఏ పార్కులో చూసినా, ఏ సినిమాలో చూసినా కనిపిస్తూందని వూరందరికీ తెలిసినా నీకు, నాకు తెలిసిందే? ఎప్పుడు వెడుతూందో, ఎప్పుడు వస్తూందో, ఎక్కడికి వెళ్ళిందో, ఏం చేస్తుందో నీవేమయినా చూస్తున్నావా? నేనంటే ఆఫీసులో ఏడ్చేవాడిని. ఇంటిలోవుండే నీవైనా చూస్తున్నావా దాని సంగతి. అది అలా విచ్చలవిడిగా తిరుగుతున్నా చూస్తూ యేం అడగకుండా కళ్ళుమూసుకుని వూరుకున్నావా? మూడు నెలల నుంచి జరుగుతున్న యీ భాగోతం యివాళదాకా నాకు తెలియలేదు. ఆ శంకరంగారు చెపుతుంటే నా వళ్ళు చచ్చిపోయింది. పెళ్ళీడుకొచ్చిన పిల్ల అలా రోడ్లమ్మట ఏ దౌర్భాగ్యుడితో పడితే ఆ దౌర్భాగ్యుడితో తిరుగుతూంటే యింక దానికి పెళ్ళెలా అవుతుందే!"

"ఎందుకండీ అలా చిందులు త్రొక్కుతున్నారు. దౌర్భాగ్యులతో యెందుకు తిరుగుతుంది! అడ్డమయినవాళ్ళతో తిరగనిస్తానా. నా కా మాత్రం తెలియదనుకున్నారా?" నిబ్బరంగా చెపుతున్న జానకమ్మవంక తెల్లబోయి చూశారు రావుగారు.

"ఏమిటీ! అయితే నీకు తెలుసన్నమాట. అదిలా తిరుగుతున్నట్లు నీకు తెలిసే వూరుకున్నావుటే! దానికి బుద్ధిలేకపోతే నీకూ బుద్ధిలేకపోయిందా? అవ్వ! పెళ్ళీడు కొచ్చినపిల్ల అలా తిరుగుతూంటే చూస్తూ వూరుకోడానికి నీ బుద్ధి గడ్డితిందే!" కోపం పట్టలేక పోయారు రావుగారు.

"నా బుద్ధి గడ్డితినలేదు, నిక్షేపంలావుంది. కాబట్టే వూరుకున్నా. మీ మాత్రం మంచీ చెడ్డా నాకు తెలియవనుకున్నారా? అడ్డమయిన వాళ్ళతో ఏం తిరగడంలేదు అది. నిక్షేపంలాంటి కుర్రాడితో, నెలకి అయిదువందలు తెచ్చుకునే రాజాలాంటి అబ్బాయితో తిరుగుతూంది."

"వాడెవడయితేనేం? ఎన్ని వందలు తెచ్చుకుంటే మనకేమిటే, పరాయి మగవాడితో యీడొచ్చిన పిల్లని తిరగనిస్తావా? వాడేం నీ అల్లుడా, అలా విహారాలు చేస్తూంటే చూస్తూ సంతోషించడానికి?"

"ఆ అల్లుడు కాకపోయినా కాబోయే అల్లుడుగాబట్టే వూరుకున్నాను. లేకపోతే వూరుకుంటా నేమిటి చూస్తూ."

"ఎవడేవాడు. ఆ కాబోయే అల్లుడెవడో! ఏమిటి తల్లీ, కూతుళ్ళు యిద్దరూ కలసి ఏం నాటకం ఆడుతున్నారు. ఇంటిలో మగవాడిని వున్నానని కూడ మరచిపోయి, ఇద్దరూ యెవరికివారే పెద్దలయిపోయారా? నీ కూతుర్ని పెళ్ళాడుతానని చెప్పాడే వాడు? ఈ బుద్ధి దానికి పుట్టిందా?" భార్య ధోరణి విపరీతమయిన కోపం తెప్పించింది రావుగారికి.

"ఎవరికి పుట్టితే ఏం. మంచి బుద్ధే పుట్టిందిగాని, చెడు బుద్ధేం గాదు. నిక్షేపంలాటి అల్లుడు రాబోతూంటే కొంప మునిగినట్లు అలా రాద్ధాంతం చేస్తున్నారేమిటి?"

"నీకేం మతివుందా? పోయిందా? అల్లుడంటావు, అనబోతాడంటావు నీ కూతుర్ని చేసుకుంటానని నీతో వచ్చి చెప్పాడా!"

"చెప్పలేదు యింకా, చెపుతాడు."

"నీకెలా తెలుసు! ఏమిటే యీ భాగోతం!"

"అలా అడగండి చెపుతాను. ఎందుకు చేసుకోడు మన అమ్మాయిని. మన అమ్మాయికి యేం లోటు? చదువు తక్కువా, అందంతక్కువా? మూడు నెలలనించి అమ్మాయి, అబ్బాయి చక్కగా చిలకా గోరింకల్లా జంటగా తిరుగుతూ, ఒకర్నొకరు ప్రేమించుకున్నారు. రేపో, మాపో పెళ్ళి

కూడా చేసుకుంటారు. కట్నాలు, కానుకలు అక్కర్లేకుండా దాని పెళ్ళి అదే చేసుకుంటుంది?"

"ఏమిటే నీ కా ధైర్యం. చేసుకుంటాడని, దాన్నిలా విచ్చలవిడిగా తిరగనిస్తున్నావు. తరువాత చేసుకోనంటే యేం చేస్తావేం?"

"శుభం పలకరా అంటే ఏదో అన్నాడట మీలాంటివాడే గాబోలు. అతనలాంటి దగాకోరువాడు, అల్లర చిల్లరవాడుగాదు. పెద్దమనిషి, ఉద్యోగస్థుడు, ఇద్దరూ యీ మూడునెలలనుంచి యెంతో అన్యోన్యంగా తిరుగుతున్నారు. ఒకరంటే ఒకరికి యెంతో యిష్టం! ఇంతదాకా వచ్చాక ఎందుకు చేసుకోడు!"

"అయితే యిదంతా నీ పన్నాగమేనా? దానితో చెప్పింది నీవేటే?" తెల్లబోతూ ఆశ్చర్యంగా చూశారు రావుగారు.

"అ....నేనే చెప్పాను! నే వప్పుకుంటేనే అదలా తిరుగుతూంది అతనితో. అమ్మ పెట్టదు, అడుక్కుతిననీయదంటే యెలా? పాతికేళ్లు మీదపడుతున్నాయి. ఇంతవరకు మీరు పెళ్ళి చేయలేకపోయారు. దానంతట దానిని వదిలితే అదే తెచ్చుకుంటుంది మొగుడిని! మన వంతు రెండు అక్షింతలు చల్లడమే! దమ్మిడి కట్నం లేకుండా పని జరిగిపోతుంది" ధీమాగా అంది జానకమ్మ.

"వోసి నీ అసాధ్యంకూలా! ఎంత దానివే! మాటమాత్రమయినా నాతో చెప్పకుండా ఇద్దరూ యింత నాటకం ఆడుతారా?"

"ఆ ...చెపితే చేసే నిర్వాకం యేమిటి? అడ్డు పుల్లలు వేయడమేగా! ఆంక్షలు పెట్టడమేగా!" మూతి తిప్పింది జానకమ్మ.

"అయితే ఎప్పుడో యిద్దరూ పెళ్ళాడుతారని, ముందే ఇద్దరూ ఇలా తిరుగుతూంటే లోకం యేమనుకుంటుందే!"

"ఆ... లోకం! మరేం పని పాటులేని లోకం అనుకోడానికేం! మన తిప్పలు మనం పడతాము అవన్నీ లెక్క చేస్తూ కూర్చుంటే ఎలా? మీరు

ఐదేళ్ళుగా సాధించలేని పని అది ఐదు నెలలో సాధించుకొస్తుంది. ఇంకో నెలలో రాజాలాంటి అల్లుడు వస్తాడు చూస్తూండండి" ముసిముసి నవ్వులు నవ్వింది జానకమ్మ.

"అయితే యీ తెలివి తేటలు యీ బుద్ధి నీ కెలా పుట్టింది? ఇంత బుర్ర యీ ఆలోచనా నీ దేనా!"

"పూ ర్తిగా నాది కాదనుకోండి ఆ మధ్య ఏదో పత్రికలో ఒక కథ చదివాను యిలాగే కట్నాలు కానుకలు యీయలేక ఆడపిల్ల పెళ్ళి చేయలేక పోతాడు ఆ తండ్రి ఆ అమ్మాయి కా స్త బాగా చదువుకున్న అమ్మాయి యింక యీ తల్లి దండ్రులవల్ల అయ్యే పని కాదని తనే ధైర్యంచేసి ఒక అబ్బాయిని ప్రేమించి దమ్మిడీ ఖర్చు లేకుండా రిజిష్టరు మేరేజి చేసుకుం టుంది! మన అమ్మాయికి రిజిష్టరు మేరేజివద్దు మనమే లక్షణంగా పెళ్ళి చేసేద్దాం. ఆ మాత్రం పెళ్ళిచేయలేకపోం, కట్నాలు యీయలేకపోయినా!" కూతురు పెళ్ళి నిశ్చయం అయినట్లే మాట్లాడసాగింది జానకమ్మ.

"నీ తెలివి తెల్లారినట్లే వుంది యిదంతా కథలు చదివిన ప్రయోజ కత్వమా! బాగావుంది కథల్లోలా జరుగుతే రోజుకి ఎంతమందో పెళ్ళిళ్ళు చేసేసుకుని వుండేవారు యీ పాటికి. యింతాచేసి ఆ అబ్బాయి కుటుంబం, మంచి చెడ్డా ఏమైనా విచారించావా లేదా?"

"హోస్! యీ సంగతి మీరు చెప్పాలా? వాళ్ళ బంట్రోతుద్వారా అన్ని సంగతులు రాబట్టే ముందడుగువేశాను."

"అయితే యింతకీ నిర్మలకి, అతనికి పరిచయం ఎలా అయిందే" కుతూహలం ఆపుకోలేక అడిగారు రావుగారు.

"పరిచయం ఏమిటండీ" ఆ వయసులో వాళ్ళకి ఒకరినొకరు ప్రేమించుకోడానికి పరిచయం ఉండాలేమిటి? ఆ అబ్బాయి రెండు మూడు సార్లు మన నిర్మలవైపు చూడడం గమనించాను నేను. మన నిర్మల కూడ అత నా యింట్లోకి వచ్చిందగ్గిరనించి వీధులో తారట్లాడడం, ఆ కిటికీముందు కూర్చోవడం ఇద్దరూ వాలుచూపులు చూసుకోవడం అన్నీ కనిపెట్టాను."

"కనిపెట్టి గాలం వేశావన్నమాట!"

"మరేమిటనుకున్నారు! మొదట్లో అమ్మాయి ఏవో పుస్తకాలు తెప్పించుకునేది పనిమనిషిద్వారా; తరువాత ఇద్దరూ ఒకరి నొకరు చూసుకుని నవ్వుకోవడం కళ్ళతో మాట్లాడుకోవడం అన్నీగమనించి పండగనాడు అతనికి పాపం వంటరివాడని పిండి వంటలు పంపించాను వాళ్ళ బంట్రోతు చేత. అబ్బాయి సంతోషపడి నన్నుచూసి నమస్కారం చేశాడు. తర్వాత దాని పుట్టినరోజున అతనిని మన యింటికి అమ్మాయిచేత టీకి రమ్మని చీటి రాసి పంపించాను. అతను వచ్చాడు. ఇద్దరూ ఎంతో చక్కగా మాట్లాడుకున్నారు. యిద్దర్నీ సినిమాకి పంపించాను యింక ఏముంది అప్పటినించి యిద్దరూ ప్రేమించుకున్నారు వాళ్ళిద్దరూ తిరుగుతూంటే నే నేం అడ్డుపెట్టలేదు. రేపో, మాపో పెళ్ళి చేసుకుని మన భారం తగ్గిస్తారు"

"బాగానే వుంది వరస యింట్లో వున్న నాతో ఒక్క ముక్క అయినా చెప్పకుండా యింత నాటకం ఆడుతున్నావా?"

"చెపుదామనుకున్నాను వాళ్ళు నిశ్చయం చేసుకున్నాక చెప్పవచ్చని వూరుకున్నాను."

"ఆ నిశ్చయం ఎప్పుడో జరిగేవరకు వూరందరికి ఏమని సమాధానం చెప్పడమే నా కేం నచ్చలేదీ వ్యవహారం!"

అదిగో, మిమ్మల్ని చూస్తే నా కందుకే మంట! మీరు పెళ్ళి చేయలేరు చేసుకునేదానిని చేసుకోనీయరు. ఒక్క నెల రోజులు కళ్ళుమూసుకు వూరుకుంటే సరి. అన్నీ చక్కబడతాయి. యీ లోపల అనేవాళ్ళని అననీయండి, పట్టించుకోకండి"

"ఏమో! మీ తల్లీ కూతుళ్ళు యిద్దరూ ఏం చేసుకుంటారో చేసుకోండి నా కేం తెలియదు. తరువాత ఏదైనా అయితే మాత్రం వూరుకోను. ఆ....!"

"ఆ....అలా మీ రూరుకోండి! అంతే చాలు! కూతురి పెళ్ళి చేసినంత ఫలం!"

* * *

"ఏమే! నీ కూతురి పెళ్ళి ఎందాకా వచ్చింది?" అప్పుడే నెలరోజు లయింది చెప్పి నీవు? విహారాలు యింకా యెక్కువై నాయల్లేవుంది! వూళ్ళో తలెత్తుకు తిరగాలా వద్దా నేను. ప్రతివాళ్ళు గుసగుసలాడడమే! వింతగా చెప్పుకోవడమే! నన్ను బ్రతకనీయరేమిటి ఇద్దరూ కలసి, నీ ప్రతాపం నీ కూతురు ప్రతాపం యింక చాలు వాళ్ళిద్దర్నీ ఆ చేసుకునే పెళ్ళేదో త్వరగా చేసుకోని, తర్వాత ఏడవమను"

"బాగుందండీ మీ వరస! చేసుకుంటారు వాళ్ళు, మీ కెందుకా తొందర! పెళ్ళంటే నిమిషాలమీద నిశ్చయించుకుంటారా? ఇద్దరూ బాగా సన్నిహితు లవ్వాలా? వాళ్ళ స్నేహం బలపడాలా? లేకపోతే ముందురోజే పెళ్ళి మాటలు ఆడేసుకుంటారా? వాళ్ళ వాళ్ళని అడగడం. మంచి చెడ్డా చూసుకోవద్దా అతను మాత్రం"

"అసలు యింతకీ పెళ్ళి చేసుకుంటానని ఖచ్చితంగా చెప్పినట్లేనా!"

"చెప్పలేదు యింకా ఏదీ అమ్మాయిని నెమ్మదిగా అడగమని చెప్పాను నిన్ననే, చేసుకుంటాడండీ, అమ్మాయి అంటే ఎంత ప్రేమో తెలుసా! అమ్మాయి పుట్టినరోజున చక్కని పుస్తకం ప్రజంట్ చేశాడు. మొన్న పండక్కి అరవై రూపాయల చీర బహుమతి యిచ్చాడు, ఇదంతా ఇష్టం లేకపోతే ఎందుకు చేస్తాడు ..."

"ఏమో యిదంతా నా కేం నచ్చలేదు, నా కే సంగతి తేల్చిచెప్పాలి వారం రోజుల్లో, నీవే అడుగుతావో, నీ కూతురే అడుగుతుందో అదంతా నాకు తెలియదు. నాకు ఏ కబురు నిశ్చయంగా వారం రోజుల్లో చెప్పండి. యీ వ్యవహారం వూరుకుంటూంటే చాల దూరమే వెడుతూంది ఏదో పీకల మీదకి తెచ్చేట్లున్నారు యిద్దరూ కలసి.

"ఏమిటండీ మీ అనుమానాలు మీరూను అన్నింటికీ తొందరే రేపే అడగమంటాను దాన్ని"

"ఏదో ఏడవండి తొందరగా మాత్రం యీ సంగతేదో తేలాలి!"

* * *

"ఏమండీ మీ రొకసారి ఆ గోపాలరావుతో మాట్లాడిరావాలి"

"ఏ గోపాలరావు?"

"అదే అతనే మన నిర్మల స్నేహితుడు గోపాల్‌తో మాట్లాడండి వెళ్ళి!"

"నేనా? నే నెందుకు మాట్లాడ్డం!" ఆశ్చర్యంగా చూశారు రావుగారు భార్య వైపు.

"బావుంది, ఎందుకేమిటండీ, మీ కూతురు పెళ్లి సంగతి మీరు కాక పోతే ఎవరు మాట్లాడుతారు?"

"ఏం ఏమయింది? నేను మాట్లాడవలసిన అవసరం ఏమి వచ్చింది? నేను మాట్లాడడం, నేను మంచి చెడ్డా ఏం చూడక్కర లేదుగా! అన్నీ నీ కూతురే నిశ్చయించుకుంటుందేమో!"

"బాగుంది అలా అంటే ఎలాగండి....!"

"ఏమిటే బాగుండకపోవడం, నీవూ, నీ కూతురూ కలసి రాజా లాంటి అల్లుణ్ని తెస్తారేమో, ఏమయింది? ఏం, చేసుకోను పొమ్మన్నాడా ఏమిటి?"

"ఏమిటండీ ఆ అపశకునం మాటలూ మీరూను, ఎందుకు చేసుకో నంటాడు"

"మరయితే నే వెళ్ళి అడగడ మెందుకు! నిర్మల అడిగిందా? ఏమన్నాడు?"

"ఆ... నిన్నను అడిగిందట .... ఇదివరకు రెండు మూడుసార్లు చూచాయగా అడిగితే 'చూద్దాం,చూద్దాం చేసుకుందాం తొందరేం' అని నాన్చే శాడట, నిన్నను అడిగితే 'చేసుకో వచ్చులే' అని ఏ సంగతి సరిగా చెప్ప కుండా దాటేశాడట"

"అయిందీ, నే ననుకున్నంతా అయింది. చెపితే విన్నావుటే, చేసు కుంటాడని దాన్నలా విచ్చలవిడిగా తిరగనిచ్చావు, మహా తెలివి తేటలు

నీకే వున్నట్టు. అతనికి కూతురిని చూపించి వలలో వేసుకుందామను కున్నావు. నీ పాటి తెలివితేటలు అవతలవారికి లేవనుకున్నావు,ఏం ఇప్పుడు ఏం చేస్తావు? వాడు చేసుకోనంటే! చేసుకోను పొమ్మంటే నీవు, నీకూతురు ఏం చేస్తారే."

"అబ్బబ్బ, వుండండి, అప్పుడే ఏదో కొంపమునిగిపోయినట్లు అలా అరుస్తారెందుకు."

"ఇంకా ఏం కొంప మునగాలని నీ ఉద్దేశం, యిది చాలదే యిప్పుడు దాన్ని అతను చేసుకోనంటే దాని గతేమిటే, యింక యీ జన్మలో దాన్ని ఎవరైనా పెళ్ళాడుతారా?"

"కాస్త చెప్పినమాట వినకుండా ఎందుకండీ అలా రద్దాంతం చేస్తారు. అతనేం యింకా చేసుకోనని చెప్పలేదు, చేసుకుంటానని చెప్పలేదు అది చిన్నదీ, మంచి చెడ్డా ఎలా అడగాలో దానికేం తెలుస్తుంది, పెద్ద వాళ్ళం మనం వుండగా అదేం మాట్లాడుతుంది? కాస్త మీ రెళ్ళి అతనితో మాట్లాడి అసలు అతని అభిప్రాయం ఏమిటో తెలుసుకరండి వాళ్ళ వాళ్ళకి రాయమంటాడో ఏమిటో అడిగిరండి"

"ఏం....ఇప్పుడు నాసహాయం కావల్సి వచ్చిందా? ముందు నన్నడిగే చేశారా మీ రిద్దరూ, ఈరోజు నేనడిగి రావడానికి. వెళ్ళు, నీవే వెళ్ళి యేం మాట్లాడుతావో మాట్లాడి....కూతురి పెళ్ళి చెయ్యి. నే వెళ్ళను."

"అలా అంటే యెలాగండీ. మగవారు మీరు వుండగా నేనెలా మాట్లాడతాను. ఏం బాగుంటుంది! అలా కోపం తెచ్చుకుంటే యెలా? మన పిల్ల మంచిచెడ్డలు మనం చూడకపోతే ఎలా?"

"ఆహా—హా! ఏం చక్కగా చెపుతున్నావు. ఇదివరకు ధీమాగా చెప్పిన కబుర్లు అన్నీ ఏమయిపోయాయి. నే నూరుకుంటే చాలు, పెళ్ళయి పోతుందన్నావు. వూరికే అన్నారా 'ఆడపెత్తనం, మంగలి వైద్యం' అని. చేశావు నిర్వాకం."

"చాల్లెండి ఏం చెప్పుతారుగాని, పెళ్ళి మాట్లాడిరండి. బహుశా పెద్ద వారు, మీరేం అడగలేదనినే అతనలా అనివుంటాడు."

"ఇది పెద్దవాళ్ళు చేసే పెళ్ళి కాదుగా?"

"బాబూ మీకో నమస్కారం. ఏదో పొరపాటయింది. తెంపలేసు కుంటాను, పెళ్ళి అడిగిరండి" గర్వంగా తలెత్తి చూశారు రావుగారు.

• • • •

"ఏమండీ, ఏమన్నాడండీ అతను?" వాడిపోయిన మొహంతో వచ్చిన భర్తని ఆదుర్దాగా అడిగింది జానకమ్మ. భార్యవంక ఉరిమి చూశారు రావుగారు.

"ఏమవుతుంది నీ శ్రాద్ధం! నే ముందే చెప్పాను. నాకు తెలుసు ఈ వ్యవహారమంతా. పెద్ద తెలివితేటలు నీకే వున్నాయని. అబ్బాయిని వలలో వేసుకుని, దమ్మిడీ కట్నం లేకుండా పెళ్ళిచేసేద్దాం అనుకున్నావు. అనుకుని పప్పులో కాలేశావు. ఇంక యిప్పుడు యేం చేస్తావు? యీ వూర్లో యింక నేను తలెత్తుకు తిరిగే తాహతు పోయింది. దానికి యీ జన్మకి పెళ్ళయ్యే గీత తప్పింది ఏడవండి యిద్దరూ కలిసి" తీక్షణంగా చూస్తున్న భర్త చూపులకి భయపడింది. కలవరపడుతూ "ఏం జరిగిందండీ అసలు. ఏమన్నాడు అతను, చేసుకోనన్నాడా?"

"ఆ... లేకపోతే ఎగిరి గంతేసి నీ కూతురుపాటిది యింకెవరూ దొరకరని వెంటనే చేసేసుకుంటా డనుకున్నావా? చేసుకోను పొమ్మన్నాడు. 'నేనేం పెళ్ళిచేసుకుంటానని మీతో చెప్పానా' అని యెదురు ప్రశ్న వేశాడు. 'మీరు పొరపడి అలా అర్థంచేసుకోవడం నా తప్పా' అన్నాడు. 'అసలు మీకు ఆ అభిప్రాయం యెలా కలిగింది. నే నెప్పుడూ అనలేదే!' అని ఆశ్చర్యపోయాడు."

"అయితే, ఆలా పెళ్ళీడు పిల్లతో, వయసొచ్చిన పిల్లతో ఎందుకు తిరిగాడు. ఎందుకు దానికి ప్రజంట్సు అవి పంపాడు" కోపంతో జానకమ్మ మాటలు తడబడ్డాయి.

"అడిగా, అదీ అడిగా! 'నేనేం మీ అమ్మాయిని నాతో తిరగమని కోరలేదు. నాతో స్నేహం చెయ్యమని అంతకంటే అడగలేదు. ఆ అమ్మాయంతట ఆ అమ్మాయే నాతో మాటలు ఆరంభించి, పరిచయం చేసుకుంది. నన్ను ఆకర్షించడానికి ప్రయత్నించింది. కోరి ఆ అమ్మాయంతట ఆమె వస్తూంటే నాకేం పోయిందని తిరిగాను. మగవాడిని, ఆమెకి లేని అభ్యంతరం నాకేం వుంటుంది. స్నేహంగా వున్నామని యేవో సందర్భంలో చిన్న ప్రజంట్స్ యిచ్చాను. కలిసి తిరిగినంతమాత్రాన పెళ్ళాడాలని ఎక్కడయినా వుందా? ఆమెని అలా స్వేచ్ఛగా వదలడం మీ తప్పా? లేక నేను నిర్మలతో తిరగడం తప్పంటారా. మీకు లేని అభ్యంతరం నా కెందుకుండాలి' అన్నాడు. అనవలిసిందంతా ధీమాగా మొహంమీదే అన్నాడు."

"అంటూంటే మీరెలా వూరుకున్నారండీ. మొహం కాల్చక. పెద్దమనిషి, ఉద్యోగస్థుడు నాలుగు నెలలు తిరిగి యిప్పుడు లేదంటాడా? మొహం నలుగురి ముందూ యీడ్చకుండా మీరెలా వూరుకున్నారు. అసలు మిమ్మల్నినాలి, గట్టిగా నాలుగూ అడగకుండా వూరు...."

"నోర్మూయ్!" కోపంతో హుంకరించారు రావుగారు. "అట్టే పేలకు. చేసిన నిర్వాకం చాలక పైగా నామీద పడుతున్నావా. నాతో చెప్పకుండా చెయ్యకుండా, ఇద్దరూ కలసి తెలివితేటలనుకుని వెధవపని చేసి, యింకా నోరుమూసుకు వూరుకోక నన్నంటావా? ముందు నా సలహా అడిగి చేశావా? అసలు నాతో చెపితే యింతదూరం వచ్చేదా వ్యవహారం! అడగ లేదట. ఏం అడుగుతాను? ఏ మొహం పెట్టుకు అడుగుతాను. అతనన్న దానిలో యేం తప్పు వుందని అడుగుతాను. తప్పు మనలో వుంచుకుని పైగా అతన్నేం అనమంటావు? నీ కూతుర్ని అతనితో తిరగడానికి పంపించమని అతనొచ్చి నిన్నడిగాడా? నీ కూతుర్ని పెళ్ళాడుతానని నీకేం మాట యిచ్చి మోసం చేశాడా? ఏమని అడగమన్నావు? చేసిన పనికి నోరు మూసుకుని వుండకుండా యింకా పేలుతున్నావు?" ఆవేశంగా అంటున్న భర్త వంక తప్పుచేసినదానిలా చూసి తలదించుకుంది.

"అదేదీ! ఆ నిర్మల ఏదీ? ఉత్త షికార్లతోనే సరిపుచ్చిందా? లేక యింకా పైకి వెళ్ళిందా యిద్దరి స్నేహం. అతనికేం మగవాడు. ఏదన్నా జరిగితే దీని గతేమిటి? మనం ఎలా మొహం ఎత్తుకు తిరుగుతాం. యిప్ప టికీ నలుగురి నోళ్ళలో పడ్డాం. ఏదో ఉత్త స్నేహమయితే ఫరవాలేదు, దాన్నడుగు. అసలు యేం జరిగిందో వాళ్ళ మధ్య, కనుక్కో ఏడు!" విసు గంతా మొహంమీదే చూపించారు రావుగారు.

"ఇకనేనా జాగ్రత్త వుండి ఏడవండి, అతితెలివితేటలకిపోక. జరి గింది చాలు. ఇక మళ్ళీ అది గడపదాటి బయటికి వెళ్ళినట్లు తెలిసిందో ముందు నీపని పడతా జాగ్రత్త! ఆ...."

* * *

"ఏమండీ! ఏమండీ!" దాదాపు యేడుపు గొంతుతో అన్న జాన కమ్మ వంక చూశారు రావుగారు.

"ఏమండీ...." వణికే గొంతుతో అంటున్న భార్యవంక చిరాగ్గా చూశాడు. "ఏం కొంప మునిగిందని అలా యేడుపు మొహం పెట్టావు!"

"కొంపే మునిగిందండీ!"

"ఏమిటే అది!"

"ఏం చెప్పమంటారు? ఖర్మ! నిర్మల కొంప ముంచిందండీ!"

"ఆ!"

"అవునండీ! పది హేనురోజులనించి దాని వరస నాకు అనుమానం గానే వుంది. ఇవాళతో అనుమానం తీరిపోయింది. కొంప ముంచిందండీ! ఇంతపని చేస్తుందనుకోలేదు. ఇప్పుడెలాగండీ, నాకు కాళ్ళు చేతులు ఆడ్డం లేదు. ఎలాగండీ!"

"ఎలాగండీ సిగ్గులేకుండా యింకా అడుగుతున్నావు? ఈ సలహా దాన్ని వూరిమీద వదిలే ముందు అడిగేవుటే? అంతా అయిపోయాక నా సలహా కావల్సి వచ్చిందా?"

"అసలే యేడుస్తూంటే యింకా యెందుకండీ మీ దెప్పుళ్ళు. మన దెబ్బలాటకేంగాని ముందు దారి చూడండి. అది ఒకటే యేడుస్తూంది. ఏం అడిగినా చెప్పదు. ఏదో మామూలుగా సినిమాలకి, షికార్లకి తిరగమన్నాను కాని, ఇలా వళ్ళుపై తెలియకుండా పీకలమీదకి తెచ్చుకోమనలేదు. జాగ్రత్తగా వుండమని మరీమరీ చెప్పాను...."

"చాల్లే, ఇంకా సమర్థించుకుంటున్నావు చేసిన తప్పు వప్పుకోకుండా, జాగ్రత్తగా వుండమని చెప్పి పంపిందట. వయసులోవున్న ఇద్దర్నీ స్వేచ్ఛగా తిరిగిరమ్మని పంపి . జాగ్రత్తగా వుండమని చెప్పిందిట!" పళ్లు కొరికారు రావుగారు.

"ముందు యేదో చెయ్యండి, తరువాత సావకాశంగా మనం దెబ్బలాడుకుందాం. ముందు ఆ గోపాల్ దగ్గరికి వెళ్ళి చేతులు పట్టుకు కాస్త బ్రతిమిలాడండి. నయాన్నో, భయాన్నో వప్పించి రండి. అంతగా అతను వప్పుకోకపోతే ఏ డాక్టరుకో చూపించి ఏదో దారి చూడండి. నలుగురికి తెలిసి మన పరువు బయటపడకుండా యేదన్నా చెయ్యండి."

"హుఁ! ఇంకా మనకు పరువొకటి మిగిలిందేమిటి? ఏనాడో పోయింది. ఇప్పుడింక ఆ మిగిలిందికూడ పూర్తిగా పోతుంది. ఖర్మ! ఏ మొహం పెట్టుకు అడగను మళ్ళీ వెళ్ళి. వాడి కాళ్ళు పట్టుకు బ్రతిమిలాడే ఖర్మ తెచ్చారు తల్లీ, కూతుళ్ళిద్దరూ కలసి ..."

"అలా అంటే ఎలా చెప్పండి."

"నీ కూతుర్ని పంపించకూడదే! అది వెళితే దాని పరిస్థితి చూసి జాలిపడయినా వప్పుకుంటాడేమో!"

"మీకంటే ముందేచేశా ఆపని. నిన్న పంపించాను. దీని మొహం చూసి అతను కరగకపోగా ఎంతో తృణీకారంగా మాట్లాడాడట."

"అయిందీ, అయితే నే వెళ్ళిమాత్రం యేమిచెయ్యను."

"మీకు చెప్పేసరికి ..." జానకమ్మ మాటలు నోట్లోనే వుంది

పోయాయి, గేటు తెరచుకుని వస్తున్న గోపాలరావు బంట్రోతుని చూసి

"బాబుగారు మీకీ ఉత్తరం యీయమన్నారండీ" బంట్రోతు ఉత్తరం అందించాడు.

"ఇంకా యేం ఉత్తరాలు మిగిలాయి బాబూ, కొంప ముంచింది యింకా చాలలేదనా, ఇంకా ఉత్తరాలు పత్తరాలు" రుసరుసలాడుతూ నిష్ఠూరంగా అంది జానకమ్మ. తన పని అయిపోయిందన్నట్లు వెళ్ళిపోయాడు బంట్రోతు.

"ఏమిటండీ ఆ ఉత్తరం, మీకా? నిర్మలకా? ఏం రాశాడు మహానుభావుడు."

"ఏమో, చదవనీ."

"శ్రీ రావుగారికి,

ఉత్తరం యేమని మొదలుపెట్టాలో తెలియడంలేదు. ఈ జరిగిన నాటకంలో మీ పాత్ర యేమిటో నాకు తెలియందే, మీ కేమని ఉత్తరం రాయాలో అంతుబట్టటంలేదు. ఈ జరిగిన దానిలో మీ ప్రమేయం బహుశా వుండి వుండదని వూహిస్తున్నాను.

ఈ కాలంలో ఆడపిల్లల పెళ్ళిళ్లు తల్లిదండ్రులకు ఒక సమస్యగా తయారయ్యాయని నాకు తెలుసు. చదువు, కాస్తో, కూస్తో అందం వున్నా కట్నాలు గుమ్మరించే శక్తిలేక, ఎందరో కన్యలుగా చాలాకాలం వుండిపోయి తల్లిదండ్రుల గుండెలమీద కుంపటిగా తయారవుతున్నారని యెరుగుదును. ఈ సమస్యని కాస్త సులభంగా పరిష్కరించడానికి యీ మధ్య ఒక క్రొత్త పుంత త్రొక్కినట్లు వింటున్నాను. కాస్త చదువుకున్న యువతులు తమంతట తామే ముందడుగువేసి వరాన్వేషణ సాగించి, నచ్చిన వారిని ఎన్నుకుని వారిని ఆకర్షించి ప్రేమాయణాలు జరిపి, ఆ ప్రేమాయణం పర్యవసానం పెళ్ళిగా మారుస్తున్నారు. కట్నాలు కానుకలు అక్క-

లేకుండా వరాన్వేషణలో కృతకృత్యులవుతున్నారని తెలుస్తూంది. సహోద్యోగులనో, లేక కాస్త ముఖ పరిచయంవున్న ఇరుగుపొరుగు యువకులతో కాస్త పరిచయమున్నవారితో యీ పద్ధతి అవలంభించి విజయులవుతున్నట్టు వింటున్నాం. ఇలాంటి కథలుకూడా చదివినట్టు గుర్తు. దీనికి తల్లిదండ్రులు, ముఖ్యంగా తల్లుల మద్దతుకూడా వుంటుంది. పిల్లల్ని సోషల్‌గా వదిలి అబ్బాయిలని ఆకర్షిస్తే ... ఆ గాలంలో యెవరో ఒకరయినా చిక్కకపోరని, తరువాత తమ పని తేలిక అవుతుందని గుర్తించారు. ప్రేమ పెళ్లికి కట్నాలు అక్కరలేదని, యీ పద్ధతి అవలంభిస్తున్నట్టు తెలుస్తూంది.

అంతే కట్నాలని నేను ఆమోదిస్తున్నట్టు కాదు. అలా అని ఆడపిల్లల తల్లిదండ్రులపట్ల నాకు సానుభూతి లేదనిలుదు. కాని యీ అవలంబించిన పద్ధతి సరయినది కాదని, దీనివల్ల చాల ముప్పులు రావచ్చని నా వ్యక్తిగతాభిప్రాయం!

నేనూ యిలాంటి వలలో చిక్కుకున్నట్టు నిర్మలతో స్నేహం ఆరంభించిన మొదట్లో కనిపెట్టలేకపోయాను. నిర్మల చదువుకున్నా కాస్త అమాయకురాలు, మాటల సందర్భంలో "యిలా నాతో తిరిగితే మీ వాళ్ళు కేకలు వేయరా" అని రెండు మూడు సార్లు అడిగితే, "ఏమనరని, వాళ్లమ్మగారు వప్పుకుంటేనే తను నాతో తిరుగుతున్నట్లు చెప్పింది. అప్పుడు గాని నేనూ ఈ పై చెప్పిన గాలానికి తగులుకున్నానని స్ఫురించింది. నిజంగా నేను నిర్మల అందానికి ఆకర్షితుడనై ఆమెతో స్నేహం చేసుకున్నా నిర్మల, మీరు యింత గడుసుగా వ్యవహరించి, నన్ను అల్లుడుగా, చేసుకోవాలనుకోవడం నాకు కాస్త కోపం కలిగించింది. మీరు నిక్కచ్చిగా మీ అమ్మాయిని చేసుకోమని వచ్చి అడిగితే నిరభ్యంతరంగా సంతోషంగా ఆమోదించేవాడినేమో! దానికోసం యిలా డొంక తిరుగుడుగా వ్యవహరించడం నన్నిలా మోసంచేసి గెలవాలను కోవడంతో నాకు పౌరుషం వచ్చింది. అంతేకాక వయసులో వున్న ఆడపిల్లని వంటరిగా స్వలాభంకోసం పరాయి

మగవాడిని నమ్మి స్వేచ్ఛగా వదిలిన మీ మీద నాకు కాస్త తక్కువ అభిప్రాయమే ఏర్పడింది....

కథల్లో మాదిరి నిజంలోనూ యిలా వ్యవహరిస్తారని స్వానుభవం వల్లనే తెలిసింది. ఆ కథల్లో మాదిరి నేనూ యీ వలలో గ్రుడ్డిగా పడిపోకూడదని నిశ్చయించి నా జాగ్రత్తలో నే నున్నాను .. నిర్మలతో నేను ఎంత సన్నిహితంగా మెలగినా. నిర్మల నన్ను ఎన్నిసార్లు పెళ్ళి మాట అడిగినా... పొరపాటున కూడా నే నెప్పుడూ పెళ్ళి చేసుకుంటానని మాటీయలేదు। నేను నిర్మలకి ఎలాంటి భరోసా యీయకపోయినా మోహమో, ప్రేమో, తెలివి తక్కువో తెలియదు కాని నిర్మల నన్ను పూర్తిగా నమ్మి నా వశం అయిన ఆమె అమాయకత నాకు జాలేకలిగింది.

మోసం చేయాలన్న ఉద్దేశం నాకు కలలో కూడ లేదు గాబట్టే నిర్మలతో నేను అంత సన్నిహితుడనయ్యాను. కేవలం మీకు పాఠం నేర్పడం కోసమే నిర్మలతో నా కిష్టం లేకపోయినా అతిగా సంచరించాను. మీరు, నిర్మల స్వయంగా పెళ్ళి విషయం అడిగినా నిర్మొహమాటంగా నిరాకరించడం కూడ కేవలం మీకు యిలాంటి పనులవల్ల ఎంత అనర్థం జరుగుతుందో తెలియ పరచడానికే। యింత దాకా వచ్చాక యిప్పుడు నేను నిర్మలను పెళ్ళాడనంటే మీరు చేయగలిగింది ఏమిలేదు। ఎవరూ కూడ నాది తప్పని అనలేరు। యీడు వచ్చిన పిల్లని యథేచ్ఛగా వదిలిన మిమ్మల్నే దుయ్యబడతారు. ఇప్పుడు నేను నిర్మలని కాదంటే ఆమె గతి ఏమిటి? ఆమె జీవితం ఏమవుతుంది? ఇవన్నీ మీరు ఆలోచించారా? యిలాంటి మోసకారులు, మోసాలు వంచనలు జరగడం అబద్ధం ఎంత మాత్రం కాదు। అంటే నే నొక్కడినే మంచివాడిని, నీతిపరుడిని అనలేను. కానీ, అలా మీరు మోసపోయే అవకాశాలు చాలవున్నాయి. అలా మోసపోతే మీరు చేయగలిగిందీ ఏమీ లేదుసుమా అని చెప్పడానికే నేను మీకు పాఠం నేర్పడానికే యింత దూరం వెళ్ళాను. మీ కోరికని నిరాకరించడానికీ అదే కారణం। ...

యింకా యింకా మిమ్మల్ని బాధించడానికి నా మనసు వప్పలేదు. ముఖ్యంగా నిన్న నిర్మల స్థితి చూశాక యింకా యింకా తెగే వరకు లాగకూడాదనిపించింది. నేను ప్రాణంగా పేమించిన నిర్మల ఏదైనా తొందర పడితే నన్ను నేను ఎన్నటికీ క్షమించుకోలేననిపించింది.

యిలా అమ్మాయిలని 'ఎరగా' చూపించి అబ్బాయిలని వలలో వేసుకుని. అల్లుళ్ళుగా చేసుకుందామనే వారందరికీ కూడా దానివల్ల జరగబోయే అనర్థాలని కూడ గుర్తుంచుకుని మరీ అలాంటి వలలు పన్నడం మంచిది అని చెప్పడమే నా ఉద్దేశం.

వీలయినంత త్వరలో ముహూర్తం పెట్టించండి. మా వాళ్ళ అనుమతి కూడ తీసుకున్నాను. ఈ స్థితిలో నిర్మలని యింకా అలా అట్టే రోజులు వుంచి లోకుల దృష్టిలో హీనమవడం మంచిదిగాదు.

యిన్నాళ్ళు నిర్మలనీ, మిమ్మల్ని బాధించినందుకు క్షంతవ్యుడిని!

ఉత్తరం చదివిన రావుగారు తృప్తిగా నిట్టూర్పు విడిస్తే ఆనందపు నీటపొరలు కళకళలాడగా నిర్మలవైపుచూసి కళ్ళొత్తుకుంది, తృప్తిగా జానికమ్మ.

(ఆంధ్ర సచిత్ర వారపత్రిక నుండి గ్రహింపబడినది)